క్లుప్తంగా

శారదామాత జీవితం ఒక అద్భుతం



నగరంపాలెం: బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సోమవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సాహిత్య కార్యక్రమం నిర్వహించారు. దేవాలయ పాలకవర్గం అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ తూనుగుంట్ల రాధాభాయి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బోధమయ ప్రాణ మాతాజీ మాట్లాడుతూ శారదాదేవి జీవితం ఒక అద్భుతం అని అన్నారు. సాహితీవేత్త డాక్టర్. వి.నాగరాజ్యలక్ష్మీ, పూల విజయలక్ష్మీ, పద్మలత పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో భాష్యం విద్యార్థి ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తా చాటుతున్నారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో సోమవారం అంతర్జాతీయస్థాయి ఒలంపియాడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థి తేజేష్‌ను అభినందించారు. 2023–24 విద్యాసంవత్సరంలో నిర్వహించిన ఎస్ఓఎఫ్ నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన భాష్యం విద్యార్థి తేజేష్ కాకర్ల 146వ ర్యాంకుతో పాటు జోనల్ స్థాయిలో రెండో స్థానంలో నిలిచి రజత పతకం, నగదు బహుమతి గెలుపొందినట్లు చెప్పారు. ఈసందర్భంగా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాష్యం మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిషోర్, లిటిల్ ఛాంప్స్ ప్రిన్సిపాల్ శిరీష పాల్గొన్నారు.

వృద్ధుడిని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి



నెహ్రూనగర్: స్కూటీపై వెళుతున్న వృద్ధుడిని బైకుతో ఢీకొట్టి తిరిగి అతని కుటుంబాన్ని బెదిరిస్తున్న వ్యక్తులను అరెస్టు చేయాలని జనంపార్టీ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద బాధితుడితో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంబూరు అంబేడ్కర్ కాలనీకి చెందిన కర్రి దీనయ్య స్కూటీపై ఉన్న సమయంలో బైక్‌తో ఢీ కొట్టి పడేయడమే కాకుండా తిరిగి దీనయ్యపై దాడి చేశారని ఆరోపించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బాధితుడికి న్యాయం చేసి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి బాలికను గర్భిణిని చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. చిలకలూరిపేటకు చెందిన మరియబాబు గుంటూరుకు చెందిన బాలికను ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకున్నాడు. బాలికకు మాయమాటలు చెప్పి గర్భిణిని చేశాడు. బాలిక తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెదకాకాని: అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నంబూరు శివార్లలో సోమవారం చోటు చేసుకుంది. గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని నంబూరు అడ్డరోడ్డు నుంచి గ్రామంలోనికి వెళ్లే మార్గంలో ఉన్న పొగాకు గోడౌన్ వెనుక మృతదేహం ఉన్నట్లు స్థానికులు, సచివాలయ ఉద్యోగుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. సుమారు 30 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి శరీరంపై నల్లని నైట్ ఫ్యాంట్ మాత్రమే ఉంది. మృతుని రెండు చేతులపై పచ్చబొట్లు ఉన్నాయి. కుడి చేతికి కాశీ దారం ఉండటంతో పాటు ఛాతీపై కవిత అని ఇంగ్లీషులో రాసి ఉంది. మృతదేహం ఉన్న తీరును బట్టి ఎక్కడో హత్య చేసి రోడ్డు పక్కనే ఉన్న నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహాన్ని పడవేసి ఉంటారని భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి క్లూస్ టీం సభ్యులు చేరుకుని వేలిముద్రలు సేకరించారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేకుండా చేయడాన్ని బట్టి అనుమానాస్పద మృతిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ విభాగానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.

డాక్టర్ వైఎస్సార్ పాలన స్వర్ణయుగం

- ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రి రజిని - ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

నెహ్రూనగర్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో చేసిన పరిపాలన స్వర్ణయుగం అని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని గుంటూరు నగరంలోని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ముఖ్యమంత్రి అయిన తరువాత చేసిన కార్యక్రమాలు వైఎస్సార్ హయాం ముందు... తరువాత అన్నట్లుగా రాష్ట్రం యొక్క రూపురేఖలను మార్చేశారని గుర్తు చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ప్రవేశపెట్టడం ద్వారా పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడంతో పాటు విదేశాల్లో స్థిరపడి ఆర్థికంగా నిలదొక్కుగలిగారంటే అది రాజశేఖరరెడ్డి పుణ్యమన్నారు. ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించగలిగారన్నారు. మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఈనాడు ఎంతో మంది విద్యావంతులై ఉన్నత స్థానాల్లో ఉన్నారని వివరించారు. ఇందిర గృహ కల్ప ప్రవేశపెట్టి గ్రామాల రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతోందన్నారు. జలయజ్ఞం ద్వారా ఈ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా గుంటూరు జిల్లాలో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్ల పాలనలో రాజశేఖరరెడ్డి చేపట్టిన ప్రతి మంచి కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లడం జరిగిందని చెప్పారు. రాబోయే రోజుల్లో పార్టీ అభివృద్ధి కోసం పనిచేద్దాం...కార్యకర్తలందరికి పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో తన పరిపాలన కొనసాగించారన్నారు. పార్టీ భేదం లేకుండా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందించారన్నారు. మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ సంక్షేమ సారథిగా, పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అంటే ఎలా ఉండాలో చూపిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతోందన్నారు. మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ మరణం లేని నేత ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమేనన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్ రాజశేఖరరెడ్డి ఎల్లప్పుడు చిరస్మరణీయులేనన్నారు. ఆయన ఆడుగుజాడల్లో నడుస్తున్న పార్టీ వైఎస్సార్ సీపీ అని అధికారం కోసం పాకులాడే పార్టీ వైఎస్సార్ సీపీ కాదన్నారు. ప్రజల పక్షాన నిలబడి ఈ ఐదేళ్లు పోరాటం సాగిస్తామన్నారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మహానేత డాక్టర్ వైఎస్సార్ ముందుకు సాగారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే వైఎస్ జగన్ తన ఐదేళ్లు తన పాలన కొనసాగించి తండ్రికి తగ్గ తనుయుడిగా గుర్తింపు తెచ్చుకున్నట్లు వివరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ పేద వారికి సంక్షేమ పథకాలు అందించి వారి భవితకు ఎంతో భరోసా కల్పించిన ఘనత వైఎస రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ మాజీ చైర్మన్ లాల్‌పురం రాము, మచిలీపట్నం పోర్ట్ అథారిటీ మాజీ ఎండీ మేకతోటి దయాసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు కొలకలూరి కోటేశ్వరరావు, చిన్నప్పరెడ్డి, నర్సిరెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అత్తోట జోసఫ్, అంగడి శ్రీను, బండారు సాయిబాబు, ఆవుల సుందర్‌రెడ్డి, మాదా రాధాకృష్ణ, సింగ్ నరసింహ, ఓంప్రకాష్‌రెడ్డి, మురళీ, సయ్యద్ అబిబుల్లా, అగ్గిపెట్టే రాజు, కార్పొరేటర్ గోపి శ్రీనివాస్, దూపాటి వంశీ పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా



మందపాటి శేషగిరిరావు, ఆచార్య సుబ్రహ్మణ్యం, కార్పొరేటర్ బూసి రాజలతతో పాటు పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు



బస్టాండ్‌లో నివాళులర్పిస్తున్న దృశ్యం



కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి విడదల రజిని

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో...

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు సీడీ భగవాన్ అధ్వర్యంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాయర్ల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన మహనీయుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ జొన్నలగడ్డ బ్రహ్మారెడ్డి, బార్ ప్రెసిడెంట్ కాసు వెంకటరెడ్డి, మాజీ ప్రభుత్వ ప్లీడర్ పోకల వెంకటేశ్వర్లు, మాజీ పీపీ కళ్లం వెంకటరమణారెడ్డి, షేక్ హబీబ్, కొమ్మారెడ్డి, రామకృష్ణారెడ్డి, సుదర్శనం క్రాంతికుమార్, సింగ్, అనిల్‌కుమార్, మొండితోక శ్రీనివాసరావు, సౌజన్య, మాతంగి మాధవి పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పేదల మనస్సుల్లో చెరగని ముద్ర..

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమ, ప్రజా రంజక పరిపాలనతో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు పేర్కొన్నారు. సోమవారం అవర్ స్టేట్ అవర్ లీడర్– ఇండియన్ ఇంటిలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలను బ్రాడీపేటలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈసందర్భంగా ఫోరం వ్యవస్థాపకుడు జి.శాంతమూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ బూసి రాజలత మాట్లాడుతూ మహానేత భౌతికంగా దూరమై 15 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ప్రజలు నిరంతరం జ్ఞాపకం చేసుకుంటున్నారని అన్నారు. ఈసందర్భంగా ఆచార్య డీఏఆర్ సుబ్రహ్మణ్యం, రాజారెడ్డి, ఎం.నాగిరెడ్డి, సుధాకర్, అనిల్ కుమార్, గౌరీ శిరీష, చాందిని, ఐజాక్ పాల్గొని చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

నెహ్రూనగర్: ది పీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ గుంటూరు రీజియన్ ఆధ్వర్యంలో బస్టాండ్‌లోని దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్‌పీ రావు, కేవీఎస్ నరసింహారావు, వైవీ రావు, చిన్న సుభాని, సుబ్బారావు, లక్ష్మయ్య, రత్తయ్య, కేఎస్ రెడ్డి, రమేష్, జాన్‌బాబు పాల్గొన్నారు.

శ్రీనగర్‌లో..

దివంగత మహానేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని శ్రీనగర్ 7/3లో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరి ఫాతిమా పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ హుస్సేన్, బాజీ, మస్తానీ, భాస్కర్, రవి, నాగరాజు, వెంకట్, కుమారి పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్సార్ చిరస్మరణీయుడు



శ్రీనగర్‌లో కేక్ కట్ చేస్తున్న నూరిఫాతిమా



వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ కావటి తదితరులు

నెహ్రూనగర్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని వాడవాడలా సోమవారం ఘనంగా నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వైఎస్సార్ అందించిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఆయన బాటలో నడిసి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తూర్పు నియోజకవర్గంలో..

వైఎస్సార్ ఆశయ సాధన కోసం వైఎస్ జగన్ ఎంతో కృషి చేస్తున్నారని, వైఎస్సార్ పాలన విధానంలో భాగంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పేర్కొన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకం, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసాధ్యమైన హామీలతో ప్రత్యర్థులు అందలం ఎక్కారని, హామీలు ఇచ్చి మోసం చేయడం, ప్రజలను భ్రమల్లో ఉంచటం వైఎస్ జగన్‌కు చేతకాదన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే అమలుకు పోరాడదామని పిలుపునిచ్చారు.

రాష్ట్రానికి, ప్రజలకు ఏ ఇబ్బంది కలిగిన వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బుల్లా మేరీ, పఠాన్ రిహాన, నూర్‌ఖాన్, ఉషా, మర్రి అంజలి, సత్యం, పల్లా శ్రీనివాస్, యాట్ల రవి, రామయ్య, జాఫర్‌ఖాన్, కోటేశ్వరరావు, మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వాకా శ్రీనివాసరెడ్డి, ఫర్హాన, యాదాల చిన్న, రామ్, రమణి, గుదే నాగేశ్వరరావు, మస్తాన్, బి హుస్సేన్, అలా కిరణ్, అగ్గిపెట్టే రాజు, తోట ఆంజనేయులు, పూనూరి నాగేశ్వరరావు, పోలవరపు జ్యోతి, వెంకటేశ్వరరావు, యిర్రి సాయి, యాలిక శ్రీకాంత్ యాదవ్, సాంబ, మణికంఠ పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తెలుగు రాష్ట్ర ప్రలజ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని సంపత్‌నగర్, 29వ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వినూత్న రీతిలో పాలన కొనసాగించిన మహనీయుడు వైఎస్సార్ అని కొనియాడారు.

పర్యావరణపై అవగాహన ర్యాలీ



పర్యావరణ పరిరక్షణ చాటుతూ విద్యార్థుల ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ–పచ్చదనం ప్రాధాన్యం చాటుతూ సోమవారం లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల నుంచి ప్లకార్డులు చేత పట్టుకుని పెద్ద సంఖ్యలో విద్యార్థులు బృందావన్‌గార్డెన్స్, స్థంభాల గరువు వరకు ప్రదర్శన చేశారు. ప్రదర్శనను ప్రారంభించిన పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఈనెల ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు నిర్వహించిన వన మహోత్సవంలో తమ పాఠశాల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో పాటు మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను తెలియజేశారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, వృక్షాలు లేని భూమికి జీవం ఉండదని, తద్వారా జీవకోటి మనుగడ సాధ్యపడదన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యదేవర హనుమంతరావు, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిలోనే నిజమైన సంతృప్తి



అథహరున్నీసాతో పాటు ఆమె తల్లిని సత్కరిస్తున్న షేక్ ఎండీ ఖాసిం, విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడం ద్వారా నిజమైన సంతృప్తి లభిస్తుందని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తూ గత నెలాఖరున ఉద్యోగ విరమణ పొందిన షేక్ అథహరున్నీసాను సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విశ్రాంత హెచ్ఎం బడుగు విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి గౌరవ ప్రదమైన స్థానముందని, ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశిస్తున్న వారు అంకితభావంతో పని చేయాలని అన్నారు. ఈసందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాబియా బస్రీ అధ్యక్షతన విశ్రాంత హెచ్ఎం అథహరున్నీసాను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమ ఎంఈఓలు నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్ పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

పెదకాకాని: మహనీయుల అడుగుజాడల్లో నడుచుకోవాలని మాజీ సర్పంచి భోజంకుల ఏసోబు అన్నారు. పెదకాకాని మండలంలోని తంగెళ్లమూడి గ్రామంలో సోమవారం రాత్రి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచి బద్దెపూడి రమేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అహర్నిశలు శ్రమించారన్నారు. విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. పేదవారు ఇబ్బందులు పడకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా విద్యావంతుల్ని చేశారన్నారు. ఉచిత విద్యుత్ ఇచ్చి రైతులను ఆదుకోవడంతో పాటు ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్‌లు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారని కొనియాడారు. ముందుగా మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కత్తిరించి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఐటీసీ కంపెనీని మోసం చేసిన ముగ్గురిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఐటీసీని మోసం చేసిన ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. హరీష్‌షా, నిమేష మొహతా, సీజల్‌మెహతా కంపెనీతో వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కంపెనీకి బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారు. ఇటీవల నిందితులు ముగ్గురు రూ.13 కోట్లు అప్పు చేసి చెల్లించలేదు. కంపెనీ అధికారులు నిందితులు పెట్టిన బ్యాంకు గ్యారెంటీలను బ్యాంకుకు సమర్పించగా అవి ఫేక్ అని తెలిశాయి. కంపెనీ మేనేజర్ ప్రశాంత మిశ్రా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ యువకుడు బాలికను వెంటబడి వేధిస్తున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రొంపిచర్ల మండలానికి చెందిన మహేష్ బాబు, గుంటూరు నగరంపాలెం పోలీస్టేషన్ పరిధిలోని ఓ బాలికను తరచు వెంబడి వేధిస్తున్నాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాలకతీతంగా నగరాభివృద్ధికి కృషి

- ఈనెల 20న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం
- విలేకర్ల సమావేశంలో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా గుంటూరు నగర సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులం సంయుక్తంగా కృషి చేస్తామని మేయర్ కావటి మనోహర్‌నాయుడు చెప్పారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20న నగరపాలక సంస్థ సాధారణ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. గుంటూరు నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశాల అనంతరం ఎన్నికల కోడ్ వల్ల సమావేశాల ఏర్పాటులో జాప్యం జరిగిందని, ఈ నెల 20న సాధారణ సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సాధారణ ఎన్నికలలో కొత్తగా ఎన్నికైన గుంటూరు తూర్పు, పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు గుంటూరు నగర పాలక సంస్థ ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉండడానికి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. చాలా ఏళ్ల తరువాత గుంటూరు ఎంపీ కేంద్ర మంత్రివర్గంలో ఉండటం హర్షించదగ్గ విషయమన్నారు. గుంటూరు నగరంలో కేంద్ర ప్రభుత్వ అనుబంధంగా జరగాల్సిన పెండింగ్ ఆర్‌యూబీలు, ఆర్వోబీల నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. గుంటూరు నగరానికి ఐకానిక్ వంటి పీవీకే నాయుడు మార్కెట్ నిర్మాణం చేయాల్సి ఉందని, ప్రస్తుతం అందులో ఉన్న వ్యాపారులకు కొత్తగా నిర్మిస్తున్న మార్కెట్‌లో స్థానం కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సుదీర్ఘ కాలం పాలకవర్గం లేని గుంటూరు నగరపాలక సంస్థకు ఎన్నికలు నిర్వహించారని, ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించిందని గుర్తుచేశారు. నాటి నుంచి గుంటూరు నగరంలో పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా సమగ్ర అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధులం సమష్టిగా పని చేశామని పేర్కొన్నారు. నగరంలో మౌలిక సదుపాయాలు, తాగు నీటి సరఫరా మెరుగుపరిచామని వెల్లడించారు. పార్కులను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. రానున్న కాలంలో అందరం సమైక్యంగా నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నగరాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆర్థికసాయం

తెనాలి: పట్టణ నందులపేటకు చెందిన మామిడాల సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె మనవరాళ్లు మామిడాల వెంకటశివ నీలిమ, శివనివేదిత, శివ నిశాంతిలు సోమవారం బ్రాహ్మణ సంఘ నాయకులు చేతులమీదుగా ఆర్థికంగా వెనుకబడిన ఇంజినీరింగ విద్యార్థులకు రూ.50 వేలు అందజేశారు. ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సాయం అందించారు. ఆర్థిక వెనుకబాటుతనంతో ఎవరూ చదువుకు దూరం కారాదనేది తమ బామ్మ ఆశయంలో భాగంగా తాము ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు సాయపడుతున్నట్లు శివనివేదిత తెలిపారు. సీతామహాలక్ష్మి చేసిన సూచన ప్రకారం ముగ్గురు మనవరాళ్లు ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడినట్టు బ్రాహ్మణ సంఘ నాయకులు వెల్లడించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత లక్కరాజు లక్ష్మణరావు మాట్లాడుతూ శివనివేదిత సోదరుల వితరణను అభినందించారు. వీరి స్ఫూర్తితో లాప్‌టాప్‌లు ఇచ్చేందుకు కొడవటికంటి కుమార్ ముందుకొచ్చారు. బ్రాహ్మణ సంఘ నాయకులు, పోతావఝుల పురుషోత్తమ శర్మ, త్రిపురారిభట్ల దత్తాత్రేయ శాస్త్రి, పరాశరం వెంకట రాంగోపాల్, వడ్లమాని ఉమామహేశ్వరరావు, చెన్నాప్రగడ శ్రీనివాస్, దావులూరి శ్యాం, మామిడాల జ్ఞాన ప్రసూనాంబ, మహావాది సువర్ణ, పరాశరం లక్ష్మీ పద్మావతి పాల్గొన్నారు.